క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: ఉమ్మడి జిల్లాలోని రాయచోటి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కె. నాగమల్లారెడ్డి కుటుంబానికి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2.10 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చెక్కును హోంగార్డు కుటుంబ సభ్యులైన కుమారులు పవనీశ్వర్, పవన్‌కుమార్‌రెడ్డి, కుమార్తె ప్రసన్నలక్ష్మిలకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ యోగక్షేమాలు, వారి విద్య గురించి విచారించారు. బాగా చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పోలీస్‌శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందజేశారు.

విద్యుత్ భారం ఆపాలి



పాతబస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ భారాన్ని తక్షణమే ఆపాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్ పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు పాత బస్టాండులోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒక వైపు ప్రజలు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను భరించలేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మరో వైపు విద్యుత్ అదనపు చార్జీల పేరుతో భారం విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, పాపిరెడ్డి, చంద్రారెడ్డి, ఫరూక్ హుస్సేన్ పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పౌరసరఫరాల శాఖ హమాలీలు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ నాయకులు నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సివిల్ సప్లయ్ యూనియన్ కడప జిల్లా స్థాయి సమావేశం శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సివిల్ సప్లయ్స్ హమాలీలకు ప్రతి నెల 10వతేదీ లోపు బిల్లులు చెల్లించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా ఈపీఎఫ్ లేని హమాలీలకు వెంటనే ఈపీఎఫ్ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, యూనియన్ నాయకులు మురారి, రమణ, శరత్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని మైదుకూరు పసుపు కొనుగోలు కేంద్రంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైదుకూరు పసుపు కొనుగోలు కేంద్రంలో జిల్లా డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ మేనేజర్ల అండదండలతోనే అక్రమాలకు పాల్పడ్డారని.. వారిపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి



ఆర్ట్స్ కాలేజీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

వైవీయూ : విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'మేరా మట్టి.. మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్ర స్ఫూర్తిని చాటిచెప్పేలా ఆజాదీ కా అమృత్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తిని రగిలించేలా ఉన్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల్ నాగరాజు, శివరామకృష్ణ, డా. వై. సావిత్రిలు మాట్లాడుతూ దేశభక్తి అలవరచుకోవాలన్నారు.

జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వంలో కుల మతాలు, పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా అన్నారు. ×గడప గడపకు మన ప్రభుత్వం¥ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 27వ డివిజన్‌లోని గౌస్ నగర్, గంజికుంట కాలనీ ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. పలువురు తమ సమస్యలను తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తన భర్త చిన్నకుళ్లాయప్పకు మూగ, చెవుడు ఉందని గతంలో పింఛన్ వచ్చేదని, ప్రస్తుతం రావడం లేదని ఆయన భార్య వెంకటలక్ష్మి తెలిపింది. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ ఈ సారి సదరం క్యాంపులో ఇతనిపేరు నమోదు చేయించి తనకు తెలపాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. తమ వీధిలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, వచ్చినా దుర్వాసనతో వస్తున్నాయని సువర్ణ అనే మహిళ తెలిపింది. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఈఈ కరిముల్లాకు సూచించారు. తన భర్త పేరు రేషన్ కార్డులో లేదని, తమ అత్త చనిపోతే, భర్త కూడా చనిపోయినట్లు నమోదు చేశారని సయ్యద్ మున్నీ తెలుపగా, డిప్యూటీ సీఎం సచివాలయ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఇలా చేస్తే ఎలా దీన్ని ఎలా సరిచేస్తారు...పై అధికారులకు తెలిపి ఆమె భర్త పేరు రేషన్ కార్డులో ఎక్కించాలని ఆదేశించారు. షేక్ అమీర్ అనే వ్యక్తి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కుటుంబానికి రూ.8.86లక్షల మేలు జరిగిందని చెప్పాడు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నగరపాలక కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్యయాదవ్, శ్రీరంజన్‌రెడ్డి, తోట క్రిష్ణ, కోలా కొండయ్య, పస్తం అంజి, గోపాలక్రిష్ణ, షఫీ, మియ్యా, మూలే సరస్వతి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, తులశమ్మ, సుశీలమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కడప కార్పొరేషన్: గోకుల్ లాడ్జి– క్రిష్ణా సర్కిల్, దేవునికడప రోడ్లలో డ్రైనేజీ కాలువ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు. బుగ్గవంక చుట్టూ 40 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ రోడ్డులో డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వై జంక్షన్ నుంచి అప్సర సర్కిల్ వరకూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలన్నారు. నాగరాజుపేట నారాయణ కాలేజ్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ పనులను లెవెల్స్ ఆధారంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, ఏసీపీ నాగేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం రిమ్స్‌లో ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆరోగ్య మిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ పరిధిలో పనిచేస్తున్న శానిటరీ వర్కర్స్, ఉద్యోగుల ఈపీఎఫ్ వివరాలను పరిశీలించారు. రిమ్స్‌లో పనిచేస్తున్నవారి ఈపీఎఫ్ వివరాలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ఓపి సమయంలో ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ చేయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓపి, ఆరోగ్యశ్రీ సంబంధిత రిపోర్టులను తగిన ప్రణాళికలతో ఇవ్వాలన్నారు.



డ్రైనేజీ కాలువ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టుల ద్వారానే మందులు ఇవ్వాలి

కడప కార్పొరేషన్: మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టుల ద్వారానే మందులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఫార్మా జేఏసీ చైర్మన్ మద్దెల సురేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖలు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి మెడికల్ షాపులో ఫార్మాసిస్టు ఉండాలని, వారి ద్వారానే ప్రజలకు మందులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అన్ని మందుల షాపుల్లో ఎంతమంది ఫార్మాసిస్టులు ఉన్నారు, వారికి జీతాలు ఏ విధంగా చెల్లిస్తున్నారు అనే విషయాలపై విస్తృత తనిఖీలు చేయాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ డీజీ ఆదేశాలు ఇచ్చినా జిల్లా అధికారులు మాత్రం తనిఖీలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా తనిఖీలు నిర్వహించని పక్షంలో తగిన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కో ఆర్డినేటర్ డా. సి. సుమన్, ఉమామహేశ్వరరావు, ఏపీ ఫార్మా జేఏసీ కో ఆర్డినేటర్ కె. రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ఇంటింటి పరిశీలనకు సహకరించాలి

– ఆర్డీఓ ధర్మచంద్రా రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి పరిశీలనకు వచ్చిన బీఎల్‌ఓలకు రాజకీయ పార్టీలు సహకరించాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా గత వారం రోజులుగా వచ్చిన మార్పులు, చేర్పుల జాబితాను తయారు చేసి వాటిలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తమ పరిశీలనకు తీసుకు రావాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సర్వే పురోగతిని వివరించి అందులో చేపడుతున్న విధి విధానాలను వివరంగా తెలియజేశారు. బీఎల్‌ఓలు ఇంటి తనిఖీలకు వెళ్లినపుడు నివాసముంటున్న వారి ఓటును కడపలోగానీ, ఇతర ప్రాంతాల్లో ఉందోలేదో తనిఖీ చేసి వాటిని తమ పోలింగ్ స్టేషన్ పరిధిలోకి ఫారం–8 ద్వారా ఇంటి నెంబరు మార్పునకు చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. ఈ విధంగా బీఎల్‌ఓలు సర్వే పూర్తి చేసి కడపలో ప్రతి ఓటరు వారి నివాస స్థలంలోనే వారి ఓటు ఉండేందుకు అందుకు అనుగుణంగా, రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు తోడ్పాటు అందించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల తనిఖీ పూర్తయినవి, పోలింగ్ స్టేషన్ల మార్పు లు చేయవలసిన వాటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి సెప్టెంబరులో ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ ద్వారా రాజకీయ పార్టీలతో చర్చించి ప్రతిపాదించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, అర్బన్ తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, డీటీ మనోజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

విద్యార్థులు చక్కగా చదువుకోవాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం శంకరయ్య

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చదువు కోసం అన్ని రకాల వసతులను కల్పిస్తోందని కడప ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య అన్నారు. బుధవారం నగరంలోని అంధుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటుతోబాటు విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందచేసి ఇంటి వద్ద కూడా మీరు బాగా చదువుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఉపాధ్యాయులు రాజు, నరసింహులు మాట్లాడుతూ పిల్లలలో క్రమశిక్షణ పెంపొందించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. సైన్సు ఉపాధ్యాయుడు వేపరాల ఎబెనైజర్ మాట్లాడుతూ పిల్లలను ఇన్‌స్పైర్‌కు పంపేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ మునాఫ్, కరీముల్లా, రమణ, శ్రీనివాసులు, పీడీలు లక్ష్మీదేవమ్మ, పద్మావతమ్మ, మ్యూజిక్ టీచర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ భాస్కర్‌కు అభినందన



ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్న ఏఎస్ఐ భాస్కర్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కడప అర్బన్: విధి నిర్వహణలో అంకితభావంతో 36 ఏళ్లపాటు ఎలాంటి రిమార్కు లేకుండా విధులు నిర్వహించి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న కడప టూటౌన్ ఏఎస్ఐ పి.భాస్కర్‌ను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను పి. భాస్కర్ కలిశారు. ఇండియన్ పోలీస్ మెడల్‌కు సిఫారసు చేసినందుకు జిల్లా ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల, ప్రజల మన్ననలు పొందాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

కమలాపురం : నియోజకవర్గంలో ఇంటింటి సర్వే వేగవంతం అయిందని ఈఆర్ఓ చంద్ర మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు చేస్తున్న ఇంటింటి సర్వే వేగవంతం అయిందన్నారు. దాదాపు 70 శాతం సర్వే పూర్తి అయిందని, 2024 జనవరి నాటికి కొత్త ఓటరు జాబితా సిద్ధం చేస్తామన్నారు. అయితే నవంబర్ 18 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఇంటింటి సర్వేపై ఎలాంటి ఫిర్యాదులున్నా స్వీకరిస్తామన్నారు. నాయకులు కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ నాగరాజు తెలిపారు. మండలంలోని ఉలవలపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు గ్రామస్థాయిలోనే నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు.

జెడ్పీ అధికారులకు సన్మానం

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ అధికారులుగా ఎంపికై వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్ల ద్వారా అవార్డులు స్వీకరించిన సందర్భంగా జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ రంగాచార్యులను బుధవారం ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వారికి శాలువలు కప్పి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్.నాగిరెడ్డి, లంకా మల్లేశ్వర్‌రెడ్డి, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డులు స్వీకరించిన అధికారులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

తాగునీటి పథకానికి మరమ్మతులు



మంచినీటి పథకానికి మరమ్మతు చేస్తున్న మెకానిక్

కడప ఎడ్యుకేషన్: కడప నగరం గాంధ్లవీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పనిచేయని మంచినీటి పథకానికి మరమ్మతులు చేశారు. ఈ నెల 13వ తేదీన ×పనిచేయని తాగునీటి పథకం.. దాహార్తితో పిల్లల అవస్థలు¥ అన్న వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యాశాఖ బుధవారం మంచినీటి పథకానికి మరమ్మతులు చేయించింది. దీంతో పాఠశాలలో రూ. లక్షా 80 వేలతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకం పనిచేస్తోంది. ఫలితంగా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 180 మంది విద్యార్థుల దాహార్తి తీరింది. దీంతో వారంతా సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ మేసా ప్రసాద్ అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, వైఎస్సార్‌టీయూసీ ఎం. జాషువా, కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేసా ప్రసాద్ ఈ పదవికి సంపూర్ణంగా న్యాయం చేయగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బండి రమణ, శ్యాంసన్, శివ, ఖాదర్‌బాషా, నరసింహా పాల్గొన్నారు.



మేసా ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలి

కమలాపురం : ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మీరాపురంలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఈ ఏడాది నుంచి జియో కోఆర్డినేటర్స్‌తో కలిపి ఈ–క్రాప్ బుకింగ్‌ను చేయాలన్నారు. పంట సాగు చేసిన సర్వే నెంబర్‌లోని పొలంలోకి వెళ్లిన తర్వాతనే మొబైల్ కెమెరా ఆన్ అవుతుందని, అప్పుడు మాత్రమే ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పంట సాగు చేసిన రైతులకు ఒక రోజు ముందే సమాచారం అందించి పంట నమోదుకు వెళ్లాలన్నారు. ఒక్క రైతును కూడా మిస్ చేయకుండా పంట నమోదు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే ఈ–క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయాలన్నారు.

లోన్ యాప్స్ మాయలో పడి మోసపోవద్దు

వల్లూరు : ప్రజలు లోన్ యాప్స్ మాయలో పడి మోసపోవద్దని ఎస్ఐ పెద్దఓబన్న సూచించారు. మండలంలోని చిన్న లేబాక గ్రామాన్ని బుధవారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో కలిసి సందర్శించారు. స్థానిక ప్రజలతో గ్రామసభను నిర్వహించి సైబర్ నేరాలు, ఓటీపీ ఫ్రాడ్ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సులభంగా అప్పు లభిస్తుందని ఫేక్ లోన్ యాప్‌ల వలలో చిక్కుకోవద్దని, చిన్న మొత్తంలో అప్పు ఇచ్చి మీ నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించేలా మోసగాళ్లు బెదిరించడం వంటి చర్యలతో మానసిక క్షోభకు గురిచేస్తారని హెచ్చరించారు. అనధికారి లోన్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసే సమయంలో మీయొక్క కాంటాక్ట్స్, మీడియా, గ్యాలరీలకు సంబంధించిన ఎటువంటి పర్మిషన్లు ఇవ్వవద్దన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్: కడప యర్రముక్కపల్లె, స్టేట్ బ్యాంక్ పక్కన గల ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 18వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. షుగర్, థైరాయిడ్, టీబీ, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధి గ్రస్తులకు ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. థైరాయిడ్, షుగర్, ఊపిరితిత్తుల సాంద్రత పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. షుగర్, థైరాయిడ్ పరీక్షలకు పడగడపున ఉదయం 6 గంటలకు రావాలని తెలిపారు.సెల్ నంబరు 93980 08129 కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

20న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు డీకే చదువుల బాబు జీవితం–సాహిత్యం అంశంపై కర్నూలుకు చెందిన కథా రచయిత, బాల సాహితీవేత్త డాక్టర్ ఎం.హరి కిషన్ ప్రసంగించనున్నట్లు తెలిపారు.

ప్రతిభగల విద్యార్థులకు స్కాలర్‌షిప్



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా విద్యాజ్యోతి కింద ప్రతిభావంతులైన ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు బ్యాంకు సీనియర్ మేనేజర్ సంపత్‌కుమార్ తెలిపారు. మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందజేశారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యా సంస్థ కరస్పాండెంట్ ఫాదర్ దేవదాస్ ఎస్సీ ఎస్టీ వర్గాలు స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ రత్న పాల్ పాల్గొన్నారు.

మాజీ సైనికులకు చక్కటి గౌరవం

వైవీయూ : మేరా మట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా వీరులకు వందనం పేరుతో మాజీ సైనికులను గౌరవించడం సంతోషంగా ఉందని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి. లక్ష్మీనారాయణ, కార్యదర్శి బి.వి. గోపాల్‌రెడ్డి, కోశాధికారి శేషారాంసింగ్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

నేమ్ బోర్డుల్లో ఉర్దూను చేర్చడం పట్ల హర్షం

కడప కార్పొరేషన్/ కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వీధుల్లో ఏర్పాటు చేస్తున్న నేమ్ బోర్డుల్లో తెలుగు, ఇంగ్లీషుతో పాటు ఉర్దూను కూడా చేర్చడం సంతోషదాయకమని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి. ఖాదర్‌బాషా అన్నారు. నేమ్ బోర్డులను ఉర్దూలో కూడా రాయాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగరపాలక అధికారులకు విన్నవించామని, తమ విజ్ఞప్తిని మన్నించి ఉర్దూలో ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.